క్లుప్తంగా

తోపుడు బండి వితరణ



భాస్కర్‌కు తోపుడు బండి అందిస్తున్న పద్మజ, లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : స్థానిక కొత్తపేటకు చెందిన కొడతాల సునీల్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎర్రగుంట్లకు చెందిన భాస్కర్ అనే వ్యక్తికి వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోపుడు బండిని వితరణ చేశారు. బుధవారం సునీల్ కుమార్‌రెడ్డి తల్లి పద్మజ చేతుల మీదుగా నిరుపేద భాస్కర్‌కు తోపుడు బండిని అందించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న భాస్కర్‌కు తోపుడు బండి అందించినందుకు సునీల్ కుమార్‌రెడ్డిని వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శూలం శేఖర్, శూలం శివప్రసాద్, సుబ్బయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు పంపిణీ

అట్లూరు : బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు, గోపవరం మండలాలకు చెందిన రైతులకు 50 శాతం సబ్సిడీపై యాంత్రీకరణ పథకం కింద వివిధ రకాల వ్యవసాయ పరికరాలు, సస్యరక్షణ పరికరాలు, ట్రాక్టర్ ఆధారిత పనిముట్లను రైతు వాటా చెల్లించిన వారికి బుధవారం పంపిణీ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఇందులో బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రొటవేటర్, గొర్రు, గుంటక, మడకల వంటి పరికరాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ పనిముట్లు అవసరమైన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రం లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌ఐపై చర్య తీసుకోవాలి

చాపాడు : తన కుమారుడు సానా విద్యాసాగర్ రెడ్డి పై చేయని నేరాన్ని మోపి అక్రమ కేసు పెట్టిన చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్యపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నాగులపల్లెకు చెందిన సానా నరసింహారెడ్డి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29న అక్రమ కేసు ద్వారా తన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిని రిమాండ్‌కు పంపారని, ఇదే కేసులో ఛార్జ్‌షీట్ వేస్తామని చెప్పి ఎస్ఐ తన వద్ద రెండు దఫాలుగా రూ.70వేలు లంచం తీసుకున్నాడన్నారు. తన కుమారుడికి జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. ఈ ఫిర్యాదుపై విచారించాలని హైకోర్టు సూచించిందన్నారు. జిల్లా ఎస్పీ విచారించి దీనికి కారణమైన ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అధ్యాపకుడు నరహరికి డాక్టరేట్



తిరువీధుల నరహరి

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు తిరువీధుల నరహరికి తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన ఆచార్య మామిళ్ల రాజశేఖర్ పర్యవేక్షణలో 'సర్వీస్ క్వాలిటీ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ ఎ స్టడీ విత్ రెఫరెన్స్ టు ఎస్‌బీఐ అండ్ ఐసీఐసీఐ బ్యాంక్స్ ఇన్ వైఎస్సార్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారని ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దాంలా నాయక్ తెలిపారు. బుధవారం నరహరిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బిషప్ పట్టాభిషేకానికి తరలిన విశ్వాసులు

పోరుమామిళ్ల : కడప కథోళిక మేత్రాసనానికి నూతనంగా ఎన్నికైన బిషప్ డాక్టర్ సగినాల ప్రకాష్ పట్టాభిషేకానికి బుధవారం పోరుమామిళ్ల ప్రాంతం నుంచి శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో వథోళిక విశ్వాసులు పది బస్సుల్లో తరలివెళ్లారు. ఆయన కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్‌కుమార్ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా రెగ్యులర్ బిషప్ లేక అభివృద్ధి కుంటు పడిందన్నారు. మేత్రాసన గురువే బిషప్ కావడంతో విద్య, ఆధ్యాత్మిక, సేవారంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాకోబ్, బాల జోజి, జైపాల్, అశోక్, కరుణాకర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో వాదోపవాదాలు

- మీ కాంట్రాక్టు పనులకు ఎక్సెస్ రేట్లు ఎలా వేసుకున్నారు
- ఎమ్మెల్యే, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మధ్య వాదన
- ఆరు గంటల పాటు సాగిన సమావేశం
- సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్ ఛైర్మన్ ఖాజామొహిద్దీన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, వైస్ ఛైర్మన్ ఖాజామొహిద్దీన్

ప్రొద్దుటూరు : మీ కుమారుడు కొండారెడ్డి తోపాటు మీ వర్గీయులు చేస్తున్న కాంట్రాక్టు పనులకు సంబంధించి ఎక్సెస్ రేట్లు వేసుకుని ఎలా పనులు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. ఇటీవల జరిగిన కోట్ల రూపాయల రోడ్డు పనుల్లో ఐదు శాతం ఎక్సెస్‌తో ఎమ్మెల్యే తనయుడు కొండారెడ్డితో పాటు వర్గీయులు దక్కించుకున్న విషయాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజామొహిద్దీన్ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమావేశానికి హాజరయ్యారు. పలు అంశాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.160 కోట్లతో మంజూరైన పైపులైన్ పనులు రద్దు కావడంతో ప్రత్యామ్నాయంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. ఆమోదం కోసం అజెండాలో పొందుపరచగా ఒకటి రెండు శాతం మాత్రమే లెస్‌తో పైపులైన్ పనులు వేసుకున్నారని, వీటిని రద్దు చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కోరారు. ఈ విషయంపై పాతకోట బంగారు మునిరెడ్డి ప్రశ్నిస్తూ అన్నింటా ఒకే న్యాయం ఉండాలని, మీ కుమారుడు చేసుకున్న కాంట్రాక్టు పనులపై మీరు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వేసవి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పైపులైన్ కాంట్రాక్టు పనులను పిలవడం జరిగిందన్నారు. పది శాతం లెస్ వేయించి మీ వర్గీయులతో పైపులైన్ కాంట్రాక్టు పనులు చేయించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బంగారు మునిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే తన లెటర్ హెడ్ ద్వారా ఇస్తే తాము అంగీకరిస్తామన్నారు. తమ మనుషులు ఎవ్వరు కాంట్రాక్టు పనులు చేయరని ఎమ్మెల్యే చెప్పారు. పైపులైన్ నిర్మాణ పనులకు సంబంధించి వైఎస్సార్‌సీపీ సభ్యులందరిది ఒకే మాట అని మీకు ఏమైనా అభ్యంతరం ఉంటే చెప్పాలని ఆయిల్ మిల్ ఖాజా చెప్పగా, కొన్ని అంశాలకు ఓటింగ్ నిర్వహించారు. ఆరేడు పైపులైన్ కాంట్రాక్టు పనులకు సంబంధించి తాము డీసెంట్ నోట్ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సులభ్ పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టు విషయంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆమోదం తెలపగా, ఎమ్మెల్యే ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరారు.

20 నిమిషాలపాటు వాయిదా..

కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిల్ సమావేశం మందిరంలో ఉన్న బయటి వ్యక్తులను హాల్ నుంచి పంపించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను సమావేశానికి అధ్యత వహించిన ఆయిల్ మిల్ ఖాజామొహిద్దీన్ కోరారు. సమావేశానికి ఎవరైనా వచ్చి చూడవచ్చునని ఎమ్మెల్యే వరద తెలిపారు. సాధారణ వ్యక్తులు వస్తే సమస్య ఉండదని, పార్టీ నాయకులు వస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఖాజా తెలిపారు. వారిని బయటికి పంపేవరకు 20 నిమిషాల పాటు సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు. టీడీపీ సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవిని పోలీసులు నిలువరిస్తుండగా ఆమె గట్టిగా ప్రశ్నించారు. కౌన్సిల్ హాల్‌లోకి వచ్చేందుకు మీకు అనుమతి లేదన్నారు. తిరిగి సమావేశం ప్రారంభం కాగానే అజెండాలో రూపొందించిన పలు కాంట్రాక్టు టెండర్లకు సంబంధించి ఒకటి, రెండు శాతం లెస్ వేసిన పనులను తిరస్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎవరు అడ్డం వచ్చినా కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు ఆగే ప్రసక్తే లేదని అన్నారు. తమ బంధువుల సమాధులను తొలగించారని కౌన్సిలర్ నాగేంద్రారెడ్డి ప్రశ్నించగా అన్ని వివరాలు సేకరించాకే ఆక్రమణలను తొలగిస్తున్నామని, మీకు ఏమైనా అభ్యంతరం ఉంటే కోర్టుకు వెళ్లవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. చిన్న మొత్తాల్లో బకాయిలు ఉన్నా దండోర వేయించి ఊరంతా ఇంటి పన్ను, నీటి పన్నును వసూలు చేయాలని ఆదేశించిన మీరు మీ పార్టనర్స్‌కు సంబంధించిన ఎస్ ఎస్ మాల్ యజమానులు రూ.5.80 కోట్లకు పైగా బకాయిలున్నా ఎందుకు చెల్లించడం లేదని బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలను ఎక్కడ ఆక్రమించినా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేతోపాటు సభ్యులందరు కోరారు. పెట్రోలు బంకులో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి కౌన్సిలర్ పిట్టా బాలాజీ మాట్లాడుతూ అధికారులు సూచించినదానికన్నా తక్కువ ధరతో పనులు చేయవచ్చని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు పనులకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు అవగాహన కల్పించాలని కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇంటింటా కసువు సేకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ కారణంగా ఎక్కడ చూసినా చెత్త నిల్వలు పేరుకుపోయి చెత్త ప్రొద్దుటూరుగా మారిపోయిందని 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి తెలిపారు. వాహనాలు లేని కారణంగా ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ కుంటుపడిందని రాచమల్లు రమాదేవితోపాటు పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మార్కెట్‌లో కంటైనర్ బంకుతోపాటు పెద్దమ్మ గుడి నిర్మాణంపై సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయిల్ మిల్ ఖాజా ప్రశ్నించారు. లైట్‌పాలెం సెంటర్‌లో అనుమతి లేకుండా శ్రీనిధి పాల కేంద్రం ఏర్పాటు చేయడం వెనుక ఏమైనా మతలబు ఉందా అని ప్రశ్నించారు. ఇందులో ఏ మతలబు లేదని, వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శ్రీరాములపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అధికారులకు ముడుపులు ముట్టాయని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా ప్రశ్నించగా, కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. జనవరి నెలలో తన అనుమతి లేకుండా నిర్వహించిన కౌన్సిల్ సమావేశంపై చైర్‌పర్సన్ కోర్టుకు వెళ్లడంతో అజెండాకు ఆమోదం ఉండదని, కోర్టు నిర్ణయం వచ్చే వరకు పనులు నిలిచిపోకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ కోరగా ఎమ్మెల్యే వరద బలపరిచారు. కోర్టు ఆదేశాలు కాదని నిర్ణయం తీసుకోవడం సబబు కాదని ఆయిల్ మిల్ ఖాజా తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం సాయంత్రం 4.15 గంటల వరకు జరిగింది.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలో, వివిధ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు సీపీఎం నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ ప్రజాచైతన్య యాత్ర పేరుతో ప్రతి వీధికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నామన్నారు. ఆ సమస్యలు అధికారులకు తెలిపి పరిష్కరించాలని కోరేందుకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేరీ, బీబి, ప్రసాద్, ఓబులమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో రాజకీయం వద్దు

ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్



ప్రొద్దుటూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారంలో రాజకీయం వద్దని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధికారులకు తెలిపారు. ఎంపీడీఓ సభాభవనంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కల్లూరులో ఇసుక ట్రాక్టర్ల వల్ల తాగునీటి పైపులైన్ దెబ్బతినిందని సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రారెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రజల అభిప్రాయం మేరకు పైపులైన్ రూట్ మార్చి కొత్తగా పైపులైన్ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానించిందన్నారు. పనులకు అగ్రిమెంట్ అయిందన్నారు. అయితే అధికారులు పనులు నిలిపేయాలని చెప్పడంలో ఆంతర్యమేమటని ప్రశ్నించారు. అందుకు ఎంపీపీ స్పందిస్తూ మంజూరైన పనులను ఆపకూడదని అధికారులకు సూచించారు.

■ పెద్దశెట్టిపల్లె పంచాయతీ నరసింహాపురంలో తాగునీటి బోరు సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ మధుసూదన్ కోరారు. కొత్తపల్లె పంచాయతీ లింగాపురానికి సంబంధించిన 80 సెంట్ల శ్మశాన స్థలం కబ్జాకు గురవుతోందని కొత్తపల్లె ఎంపీటీసీ -1 వడ్డారపు గోపాల్ యాదవ్ కోరారు. మండలంలోని 7 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా మార్చేందుకు నివేదికలు పంపామని ఎంఈఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. బుడ్డాయపల్లె పశువైద్యాధికారి ఫణీంద్రారెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు పశు బీమా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సబ్సిడీతో సౌర విద్యుత్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాలనేలా ప్రజలకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం కేవలం రెండు మూడు రోజులు మాత్రమే అవకాశం ఇచ్చిందన్నారు. దీంతో చాలా మంది చేసుకోలేకపోయారన్నారు. సూపరింటెండెంట్ బాలన్న, హౌసింగ్ డీఈ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌లో మైదుకూరు వాసి మృతి

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని బ్రహ్మంసాగర్‌లో బుధవారం సాయంత్రం మైదుకూరుకు చెందిన మద్దు సుబ్బయ్య(67) అనే వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ గురప్ప యాదవ్ సిబ్బందితో కలిసి సాగర్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు పడ్డాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని తీవ్ర గాయాలు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో ఈ నెల 7వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఖాదర్‌గారి మహమ్మద్ సర్తాజ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బుధవారం ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన వనిపెంట మహమ్మద్ యాసిన్ ఎస్‌హెచ్‌ఓ భవానీకి ఫిర్యాదు చేశాడు. 7వ తేదీ రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రొద్దుటూరు నుంచి బస్సు దిగి గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ మహమ్మద్ సర్తాజ్‌ను ఢీకొనడంతో కుడికాలికి తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ, పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ శవయాత్ర నిర్వహించి వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడి చమురు ధరలకు అనుగుణంగా ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి తగ్గినప్పుడు మాత్రం వాటి ధరలు తగ్గించకపోవడం ప్రజలను వంచించడమే అన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజానీకంపై పుండు మీద కారం చల్లిన చందంగా వంటగ్యాస్‌పై ఒకేసారి రూ.50లు పెంచడం దారుణమన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్‌షరీఫ్, అనంతమ్మ, మోక్షమ్మ, శాఖ కార్యదర్శులు మస్తాన్‌బీ, ఆదిల్, నరసింహ, నాయకులు నాగార్జున, బాలగురయ్య, ఓబుల్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

చేపల కోసమని చెరువు నీటిని వదిలేశారు

- మూడు రోజులుగా చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు
- అధికారులు చర్యలు తీసుకుని చెరువు నీరు వృథా కాకుండా చూడాలి



చేపల కోసమని చెరువు నుంచి నీటిని బయటికి వదిలిన దృశ్యం

చాపాడు : ఖరీఫ్‌లో పంటల సాగు కోసం వేసవిలో భూ గర్భజలాలు ఇంకిపోకుండా చెరువులను నీటితో నింపుతారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నియోజకవర్గంలోని ప్రతి చెరువును నీటితో నింపి భూ గర్భజలాలు అడుగంటకుండా తాగునీటి ఇబ్బందులు రాకుండా చేస్తున్నామని ఓ వైపు చెబుతున్నారు. కానీ దీనికి విరుద్ధంగా మండలంలోని పల్లవోలు వద్ద గుండ్లకమ్మ చెరువులో ఉన్న నీటిని గ్రామానికి చెందిన కొందరు చేపలు పట్టుకునేందుకు మూడు రోజుల క్రితం నీటిని బయటికి వదిలేశారు. మూడు రోజులుగా చెరువులోని నీరు వృథాగా పోతోందన్నారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని దీనిపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి నీటిని వృథాగాపోకుండా చేస్తామని దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను రద్దుచేయాలి

బ్రహ్మంగారిమఠం : కేంద్ర ప్రభుత్వం నూతనంగా వంట గ్యాస్ సిలిండర్‌పై పెంచిన ధరలను తక్షణం రద్దుచేయాలంటూ బుధవారం బి.మఠం ఐదురోడ్ల కూడలిలో సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ వంట గ్యాస్ పెంపుదలవలన నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. సీపీఎం ఆదేశాలమేరకు ప్రతి మండలకేంద్రంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, ఆటోయూనియన్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీసీ సమరభేరిని జయప్రదం చేయండి



బీసీ సమరభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న బీఎస్పీ, ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఈ నెల 11న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న బీసీ సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నుసిమిగాస్‌పీర్, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బి.సి.రమణలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీసీ సమరభేరి గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన లెక్కల ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రాతిపదికన 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌తో చేపడుతున్న బీసీ సమరభేరి కార్యక్రమానికి బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పూలే ఆశయసాధన సమితి చైర్మన్ ఎం.పిచ్చయ్య, మైనార్టీ నాయకులు సత్తార్, బీసీ నాయకులు బ్రహ్మయ్య, దళిత నాయకులు చిన్నయ్య, మురళి, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కళాశాల వార్షికోత్సవం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ వార్షికోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతో తల్లిబిడ్డ క్షేమం

బి.కోడూరు : పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డ క్షేమంగా ఉంటారని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. బుధవారం పీహెచ్‌సీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 31 మంది గర్భిణులకు ల్యాబ్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషకాహారం తీసుకోవలలాని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా గర్భవతిగా నమోదు అయిన వెంటనే టీకాలు వేయించుకుని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు తినాలని, గ్రామాలకు వచ్చే 104 వాహనంలో కూడా వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అందరూ తప్పక 108 వాహనం ఉపయోగించుకుని ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు మాజీ మండలాధ్యక్షురాలు పద్మావతి, శేషారెడ్డి దంపతులు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పుష్పాంజలి, సీహెచ్ఓ నాగమణి, కంటి వైద్యాధికారి హుసేనయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దువ్వూరు : గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు సురేష్‌బాబు, రోషిణి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బ్రహ్మంగారిమఠం: పీఎం ఎస్ ఎంఏ పథకంలో భాగంగా బుధవారం బ్రహ్మంగారిమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సంపత్ కుమార్ గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.